క్లుప్తంగా

విద్యార్థులకు చల్లని మజ్జిగ



విద్యార్థులకు మజ్జిగ అందజేస్తున్న దృశ్యం

పాములపాడు: మండల కేంద్రంలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాలైన ఏఎస్ఆర్‌జెడ్పీ హెచ్‌స్కూలు, ఏపీ మోడల్ స్కూలు వద్ద విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకురాలు రాములమ్మ గురువారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ మండలంలో విద్యార్థులకు ప్రతి రోజు చల్లని పానియాలు దాతలు అందిస్తున్నారన్నారు. రోజు రోజుకు ఎండలు మండుతున్నాయని ఈ సమయంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం చల్లని మజ్జిగ పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, అంబయ్య, శివలింగం, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహావిష్కరణకు తరలిరండి

వెలుగోడు: ఈ నెల 16న పాములపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలని జాతీయ బి.సి.సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం విగ్రహ ఆవిష్కరణ ఆహ్వాన పత్రాలను పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులకు రఘురాముడు యాదవ్ అందజేశారు. పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్.ఇమ్మనియేల్, ఎంపీపీ లాలం రమేష్ , సర్పంచ్ జయపాల్, బి.సి. నాయకులు గోవిందు , వైఎస్సార్‌సీపీ నాయకుడు షంషీర్ అలీ తదితరులకు ఆహ్వాన పత్రాలు అందించారు. కార్యక్రమంలో బి.సి.నాయకులు నాగేశ్వరరావు, శివుడు, ఎల్లయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వం



బోరుబావిలో మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాములపాడు: గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తనివ్వమని సర్పంచు వరప్రసాద్ అన్నారు. మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా క్రిష్టారావుపేట గ్రామంలోకి తాగునీటి సరఫరా చేసే బోరు మోటారు మోరాయించగా గురువారం మరమ్మతులు చేయించారు. సర్పంచు మాట్లాడుతూ క్రిష్టారావు పేట గ్రామానికి అంతా ఈ బోరు నుంచి నీటి సరఫరా చేస్తుందన్నారు. మోటారు రిపేరి చేయించి అదనంగా మరో పైపును ఏర్పాటు చేశామన్నారు. దీంతో గ్రామంలో నీటి సమస్య పరిష్కారమైందన్నారు. జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

వంద శాతం మొక్కలు బతకాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటే మొక్కలు వందశాతం బతికేలా చర్యలు చేపట్టాలని ఏపీఓ వసుధారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. కూలీలు వలస వెళ్లకుండా ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పనులు జరిగే ప్రదేశంలో వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, ఏపీఓ నాగార్జున, ఈసీ వరదరాజులు పాల్గొన్నారు.

విద్యాకానుక పంపిణీకి పకడ్బందీ చర్యలు



బండిఆత్మకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో ఏడీవో శ్రీనివాస్

బండిఆత్మకూరు: విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో జగనన్న విద్యా కానుక కిట్లు పకడ్బందీగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్వశిక్ష్యా అభియాన్ ఏడీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం బండిఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గదులను పరిశీలించారు. 4,121 మంది విద్యార్థులు 47 పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. వీరందరికి జూన్ 12వ తేదీకి జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కిట్టులో విద్యార్థులకు అవసరమయ్యే ఏడు రకాల వస్తువులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కరిముల్లా, ఏపీఎం రాజశేఖరెడ్డి పాల్గొన్నారు.

కూల్.. సమ్మర్!

- ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు
- ఎక్కువగా కొనుగోలు చేస్తున్న మధ్య తరగతి కుటుంబాలు
- పెరిగిన గిరాకీ

నందికొట్కూరు: మండుతున్న ఎండలో బయటకు వెళ్లేందుకు దాదాపు ఎవరూ సాహసించట్లేదు. మరి ఇంట్లో ఉంటే ఓకేనా అంటే.. అదీ లేదు.. ఇంట్లో కూడా భరించలేని వేడి. ఉక్కపోత, వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూలర్లను ఆశ్రయిస్తున్నారు. మధ్యతరగతి ప్రజలను వేడి సెగ, ఎండ దెబ్బ నుంచి రక్షించి ఈ కూలర్లు కొంచెం కూల్ చేస్తున్నాయి.

జోరుగా కూలర్ల వ్యాపారం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్ తిరిగినా వేడిగాలితో ఉండలేని పరిస్థితి. ఏసీలు కొనే స్తోమత లేని మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కూలర్ల వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. నెల రోజులుగా కూలర్లు విపరీతంగా అమ్ముడుపోతున్నాయి. కొత్త కూలర్ల కొనుగోలుతో పాటు, పాత వాటిని మరమ్మతులు చేయిస్తున్నారు.

రకరకాల మోడల్స్

వివిధ రకాల కూలర్లు చల్లటి గాలినిస్తూ ఎండలో అలిసిపోయి వచ్చిన వారిని సేదతీరుస్తున్నాయి. సామాన్యులకు కూడా అందుబాటులో ఉన్న ఈ కూలర్ల సహాయంతోనే వేసవిని ఎదుర్కొంటున్నారు ప్రజలు. వీటిని ఇంటి బయట కిటికిలో అమరిస్తే చల్లటి గాలినిస్తూ ఏసీలను మరిపిస్తున్నాయి. కరెంట్ బిల్లు కూడా ఏసీలతో పోలిస్తే తక్కువగా వస్తుండడంతో వీటి వైపు సామాన్యులు మొగ్గు చూపుతున్నారు.

బ్రాండెడ్ మోడళ్లకు డిమాండ్

సింఫొనీ, జెంబో నుంచి పలు రకాల గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన కూలర్లు పట్టణంలో వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. పలు దుకాణాల్లో సింఫొని జెంబో, బజాజ్, స్పైక్‌జెన్, బ్లూస్టార్, కెన్‌స్టార్, ఓరియంట్, ఆమైజ్, డిజైర్, ఆవెల్స్, గోద్రెజ్, ఇన్‌టిక్స్ కంపెనీలకు చెందిన పలు మోడల్స్ దుకాణాల్లో లభిస్తున్నాయి. వినియోగదారులు వీటి కొనుగోలుకే ఎక్కువ ఆసక్తి చూపుతుండటంతో వీటికి డిమాండ్ అధికంగా ఉంది. కూలర్ల ధర సైజు, మోడస్‌ను బట్టి రూ. 4 వేల నుంచి రూ.12 వేల వరకూ పలుకుతున్నాయి. వీటికి అమ్మకదారులు ఏడాది వరకూ వారంటీ ఇస్తున్నారు.



నందికొట్కూరులో ఓ దుకాణం వద్ద విక్రయానికి ఉంచిన వివిధ మోడళ్ల కూలర్లు

ఎంత ఎండకు అంత గిరాకీ



ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువ పెరగడంతో ప్రజలు ఇళ్లల్లో, దుకాణాల్లో ఎండ వేడి, ఉక్కపోత నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నెల నుంచి కూలర్ల అమ్మకాలు జోరుందుకున్నాయి. కంపెనీలకు చెందిన కూలర్లకు ధరలు అధికంగా ఉండడంతో సామాన్య ప్రజలు లోకల్ కంపెనీల వాటినే కొనుగోలు చేస్తున్నారు.

– లక్ష్మీనారాయణగౌడ్ , వ్యాపారి

ఉక్కపోతను తట్టుకోలేక



41 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రత నమోదవుతుండటంతో ఉక్కపోత ఎక్కువుంది. ఇంట్లో ఉండలేకపోతున్నాం. బయట వేడి గాలులు వీస్తుండడంతో ఇంట్లో ఫ్యాన్ కింద వేడిగా ఉంటుంది. వేడిని తట్టుకోలేకపోతున్నాం. ఉక్కపోత నుంచి రక్షణ పొందేందుకు కూలర్‌ను కొనుగోలు చేశా. ఈ కూలరు కొంత మేరకు చల్లని గాలినిపస్తుంది.

– రమణయ్య, నందికొట్కూరు

వడగాలులు వీచే అవకాశం

జూపాడుబంగ్లా: శుక్ర, శనివారాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాలులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ అధికారులు హెచ్చరికలు జారీచేసినట్లు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. వ్యవసాయ పొలం పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలు, ఉపాధికూలీలు, రైతులు రెండు రోజులపాటు ఉదయం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లి 10 గంటల్లోగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. 11గంటల అనంతరం ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున వడదెబ్బసోకి ప్రాణాపాయం సంభవించే అవకాశాలుంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎండలకు బయట తిరగకుండా ఇళ్లల్లోనే ఉండాలని సూచించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ భీముడునాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆకస్మికంగా జరిగే అగ్నిప్రమాదాలు, ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై వారం రోజుల పాటు వివిధ ప్రాంతల్లో, కాలనీల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పది పరీక్షలు ప్రశాంతం



పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ పది పరీక్ష కేంద్రంలో డీఈఓ అనురాధ

నందికొట్కూరు: పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జడ్పీ హైస్కూల్ (బాలుర), శ్లోక, నవనంది పదోవ పబ్లిక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పది పరీక్షలు రాసే విద్యార్థులకు మంచినీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగిన చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉందని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు తప్పవని స్పష్టం చేశారు. ఎంఈఓ ఫైజున్నీసాబేగం, తదితరులు పాల్గొన్నారు.

పదిపరీక్షలకు 19 మంది విద్యార్థులు గైహాజరు

కొత్తపల్లి: పదో తరగతి పరీక్షలకు 19 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు పరీక్షల నిర్వహణాధికారి మోహన్‌బాబు, డిపార్ట్‌మెంటల్ అధికారి గాలీబ్ అహమ్మద్ గురువారం తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13 మంది, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 101 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను సద్వినియోగం చేసుకోండి



ఆపరేషన్ చేయించుకున్న సిరాజున్నీసాను పరామర్శిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ జహీర్ వలి

వెలుగోడు: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జహీర్ వలి అన్నారు. గురువారం వేల్పనూరు గ్రామంలోని ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ ఏరియాలో ఫ్యామిలీ డాక్టర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్థానిక పాఠశాల వద్ద ఓపీ నిర్వహించారు. మధ్యాహ్నం వరకూ గ్రామస్తులు పెద్ద ఎత్తున విచ్చేయగా జ్వరం, దగ్గు, జలుబు, నొప్పులు వంటి వాటికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 64 రకాల మందులు పంపిణీ చేశారు. ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని మంచానికే పరిమితమైన సిరాజున్నీసాను ఇంటి వద్దకు వెళ్లి డాక్టర్ జహీర్‌వలి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

26లోగా 'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మంగవల్లి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 0–18ఏళ్ల వయస్సున్న బాల, బాలికలకు తల్లి, తండ్రి, ఇద్దరు లేని వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. కేంద్ర శిశుసంక్షేమశాఖ అధ్వర్యంలో ఈ పథకం అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా తల్లిదండ్రుల్లేని బాల, బాలికలకు విద్యా, వైద్యం, అభివృద్ధి అవసరాల నిమిత్తం నెలకు ఒక్కరికి రూ.4వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఇద్దరికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. తల్లిదండ్రుల్లేని పిల్లలతో పాటు ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రులున్న పిల్లలు, ఆర్థికరంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వారి పిల్లలు కూడా అర్హులన్నారు.

'మిషన్‌వాత్సల్య'పై ప్రచారం చేయండి

ఆత్మకూరు: మిషన్‌వాత్సల్య కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి కోరారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. మిషన్‌వాత్సల్య కార్యక్రమానికి అందిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌గుప్త పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

ఆత్మకూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపల్ పద్మావతి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం డాబీ ఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు విద్యా సాగర్, కృష్ణ, సుమిత్ర, చంద్రశేఖర్, తదితరులు మాట్లాడారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

జూపాడుబంగ్లా: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని సర్పంచ్ ప్రకాశం, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు రోశన్న తెలిపారు. గురువారం మండలంలోని పారుమంచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణ, రసూల్, వీరారెడ్డి, లక్ష్మన్న, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి

నందికొట్కూరు: అంబేడ్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు పబ్బతి శివ, నగేస్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించే అంబేడ్కర్ జయంతి వేడుకలకు భారీ సంఖ్యలో తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీశైలంటెంపుల్: ఎండవేడిమి తీవ్రంగా ఉన్న కారణంగా పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థాన పారిశుద్ధ్య సహాయ కార్యనిర్వాహణాధికారి ఎం.ఫణిధరప్రసాద్ సూచించారు. గురువారం శానిటేషన్ విభాగపు కార్యాలయం వద్ద శ్రీశైలదేవస్థానం పారిశుద్యపు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

భవన నిర్మాణ పనులు చేపట్టాలి

పగిద్యాల: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో నాడు- నేడు పథకం కింద చేపట్టిన పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయని, వాటిని సత్వరమే చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్రిస్వామి, డి.కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నిలిచిపోయిన పనులను వారు పరిశీలించి, పాఠశాల ప్రత్యేక అధికారి జరీనాను కలిసి వివరాలు తెలుసుకున్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రాజెక్ట్ కాలనీలో పది రోజులుగా కొన్ని ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేయడం లేదని బీహెచ్‌ఈఎల్ క్వార్టర్స్ ప్రాంత ప్రజలు గురువారం క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



వివిధ దేశాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల అసోసియేట్ డీన్, అధ్యాపకులు

మహానంది: వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కేఎస్ఎస్ నాయక్ అన్నారు. మహానంది ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఐడీపీ కింద ఎంపికయ్యారు. వీరిని సుమారు ఆరు దేశాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమెరికా, దుబాయ్, థాయిల్యాండ్, మలేషియా, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో సాంకేతిక అంశాలు, ఇతర ఉద్యోగ అవకాశాల్లో ప్రావిణ్యత పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఎంఎల్ రాహుల్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- కలమందలపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మిడుతూరు: సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం మండలపరిధిలోని మాసపేట గ్రామ సచివాలయ పరిధిలోని కలమందలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మన భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బుక్‌లెట్లు అందజేసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అదేవిధంగా గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని తెలిపారు. రానున్న ఎన్నికలల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయులపై అసహనం..

కలమందలపాడు జెడ్పీ పాఠశాలను సందర్శించారు. 5, 7, 8 తరగతుల విద్యార్థులకు కనీసం జాతీయ గీతం, ప్రతిజ్ఞ చెప్పడం రాకపోవడంతో ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓతో ఫోన్‌లో మాట్లాడి పాఠశాలను డీఈఓ విజిట్ చేసి విద్యాప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులతో ఆంగ్ల అక్షరమాల, అంకెలు చెప్పించారు. చిన్నారులకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. కేంద్రంలో క్రుంగిన బండపరుపును (బండచట్టం) మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి వంగూరు జనార్దన్‌రెడ్డి, కమతం వీరారెడ్డి, సల్కొటి గోవర్ధన్ రెడ్డి, కమతం మహేశ్వరరెడ్డి, నాగటూరు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో సీఎం జగన్



కలమందలపాడులో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల అమలు తీరును వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

వివాహిత ఆత్మహత్య

జూపాడుబంగ్లా: కుటుంబ కలహాలతో తరిగోపుల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. కరివేన గ్రామానికి చెందిన వాణికి, తరిగోపుల గ్రామానికి చెందిన ఎల్ల మద్దయ్యకి రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇప్పటి దాకా సంతానం కలుగలేదు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడటంతో వాణి మనస్తాపానికి గురైంది. దీంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆసుపత్రి వద్దకు చేరుకొని మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

పశుగ్రాసం దగ్ధం

మహానంది: బుక్కాపురం మజరా గ్రామమైన పుట్టుపల్లెలో గురువారం పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొల్లి తులశమ్మ పాడి పశువుల కోసం వివిధ పంట పొలాల నుంచి పశుగ్రాసం సేకరించి నిలువ చేసుకోగా అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో మొత్తం కాలిబూడిదైంది. రూ.1.50లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు అంబేడ్కర్ జయంతి రోజున బహుమతులు అందజేస్తున్నట్లు ఉపాధ్యాయుడు జవహర్ నాయక్ తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



జూపాడుబంగ్లాలో మట్టినమూనాల సేకరణపై శిక్షణ ఇస్తున్న బీటీఎం ఉమామహేశ్వరి

జూపాడుబంగ్లా: ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం బీటీఎం ఉమామహేశ్వరి, ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తంగడంచ గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి భూసార పరీక్షలపై అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ రైతులు భూసారపరీక్షలు చేయించుకోవటం వల్ల భూమిలో ఉండే నత్రజని, భాస్వరం, పొటాషియంల నిష్పత్తి తెలుస్తుందన్నారు. వాటిని అనుసరించి రైతులు రసాయనిక ఎరువులను వాడుకోవాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా రైతులు ఇష్టారాజ్యంగా బస్తాలకొద్ది రసాయనిక ఎరువులను వాడుకోవటం వల్ల భూసాంద్రత దెబ్బతిని పంటల దిగుబడి తగ్గుతుందని చెప్పారు.

భూపరీక్షతో నేలలు సారవంతం

కొత్తపల్లి: రైతులు భూపరీక్షలు చేయించుకోవడం వల్ల నేలలను సారవంతంగా మార్చుకోవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత, ఎంపీడీఓ మేరి సూచించారు. మండలకేంద్రంలోని కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో ఫీల్డ్‌లేవల్‌లో మట్టి నమూనా సేకరణపై రైతుభరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

మిడుతూరు: రైతులందరూ తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ సూచించారు. గురువారం మిడుతూరు–1 రైతు భరోసా కేంద్రం పరిధిలో భూసార పరీక్షలపై ఉద్యాన సహాయకులు, వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధర్మారెడ్డి, జనార్దన్ రైతుల పొలాల్లో మట్టినమూనాలను సేకరించారు.

ఎస్టీ జాబితాలో చేర్చ వద్దు

వెలుగోడు: బోయ, వాల్మీకి, ఒరియాల కులాలను ఎస్టీ జాబితాలో చేర్చ వద్దని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బిలావత్ సుధాకర్ నాయక్ డిమాండు చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 52 జీవోను వెంటనే రద్దు చేయాలని, ఇతర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చకూడదని వెలుగోడు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్, నాయకులు కె భాస్కర్ నాయక్, బి స్వామి నాయక్ , ఎం సుబ్బా నాయక్ తదితరులు పాల్గొన్నారు

రెట్టింపు ఉత్సాహంతో 'జగనన్నే మా భవిష్యత్'

- మూడో రోజుకు చేరిన కార్యక్రమం



మహానంది మండలం బుక్కాపురంలో సీఎం జగన్ స్టిక్కర్‌కు పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పగిద్యాల: మూడు రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రజల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది. ప్రజా స్పందనను చూసిన గృహ సారథులు రెట్టింపు ఉత్సాహంతో మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇంకా ఏఏ పనులు చేస్తే బాగుంటుందని ప్రజాభిప్రాయాలను సేకరించి నివేదికలను సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, వైస్ ఎంపీపీలు పల్లె అరుణమ్మ, బోరెల్లి శ్యామలమ్మ, ఎంపీటీసీలు పగడం గోపాల్, కళావతి, ప్రియాంక, చంద్రమోహన్‌నాయుడు, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, పెద్ద ఆంజనేయులు, కాటం రాధమ్మ తదితరులు ఉన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కౌన్సిలర్లు మండడి వాణి, అశోక్ అన్నారు. గురువారం పట్టణంలోని 13, 26 వార్డుల్లో కౌన్సిలర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్ర సంక్షేమం సాధ్యమని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జగనన్నే మా భవిష్యత్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, కో–ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్, నాగంపల్లి సొసైటీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో జగనన్న ఇళ్లస్థలాల మండల కో–ఆర్డీనేటర్ పరశురాముడు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు వివరిస్తూ, ఏఏ పథకాలు అమలు అయ్యాయే ప్రజలనుంచి తెలుసుకున్నారు.

కురుకుందలో జగనన్నే మా భవిష్యత్

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్లనాగేశ్వర రెడ్డి, బందెలమాబు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించి ప్రభుత్వ పథకాలు వివరించారు. పట్టణంలోని 10, 13, 16, 19 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్‌కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్ ,కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వార్డు కౌన్సిలర్లు ముర్తుజాబీ, కలిముల్లా, షాలుపైల్మాన్, ఖుర్షీద్, చంద్ర పాల్గొన్నారు .10 వ వార్డులో వార్డు కౌన్సిలర్ షేక్షా వలి, షంషూర్, రషీద్‌ల ఆధ్వర్యంలో, 23 వ వార్డులో వార్డు కౌన్సిలర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఉద్యమంలా కార్యక్రమం

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతోంది. గురువారం పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్ ఆధ్వర్యంలో జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ ఏర్వ శ్యామలమ్మ, గృహ సారథులు, వలంటీర్లు గాంధీనగర్, లక్ష్మీనగర్‌లోని ఇంటింటా పర్యటించారు.

అడుగడుగునా అదరణ

మహానంది: మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా జననేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా ప్రజాదరణ లభిస్తోంది. మండలంలోని బుక్కాపురం, గాజులపల్లె, గోపవరం, తదితర గ్రామాల్లో గురువారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లిన నాయకులు సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. బుక్కాపురంలోని వివిధకాలనీల్లో సీఎం జగన్ చిత్రపటానికి ప్రజలు పాలాభిషేకం చేశారు.

జోరుగా జగనన్న నువ్వే మా నమ్మకం

పాములపాడు: జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు జోరుగా కొనసాగిస్తున్నారు. మండలంలోని పాములపాడులో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చౌడయ్య, తుమ్మలూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగేశ్వరరెడ్డి, లింగాలలో అంబయ్య, చెలిమిల్లలో శివలింగం, బానకచెర్లలో ఓబన్నగౌడు, మిట్టకందాలలో రఘురామిరెడ్డి, జూటూరులో నాయిని మద్దిలేటిల ఆధ్వర్యంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉందని అడుగుతూ కార్యక్రమం కొనసాగించారు.

మిడుతూరు: జగనన్న మన భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మంచి విశేషస్పందన లభిస్తుందని తిమ్మాపురం సర్పంచ్ నాగస్వామిరెడ్డి అన్నారు. గురువారం మండలపరిధిలోని తిమ్మాపురం గ్రామంలో జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి లబ్ధిని వివరించారు.